రోడ్లపైనే వ్యాపారాలు!

- ఫుట్‌పాత్‌ల ఆక్రమణ
- రాకపోకలకు అవస్థలు



నడిచే దారేది..



గోపాలపట్నం రైతు బజారు వద్ద ఫుట్‌పాత్ ఆక్రమించి వ్యాపారాలు

గోపాలపట్నం: గోపాలపట్నం బంక్ సెంటర్ నుంచి ఎల్జీపాలిమర్స్ వరకు ఫుట్ పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నారు. ఫలితంగా పాదచారులతో పాటు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. పండ్ల వ్యాపారులు, కొబ్బరి బోండాల వ్యాపారులు, కిరాణా దుకాణదారులు నడిచేందుకు దారి వదలడం లేదు. అయినా టౌన్ ప్లానింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

ఇరుగ్గా రైతు బజారు దారి

గోపాలపట్నం ప్రధాన రహదారి నుంచి రైతు బజారుకు, దిగువ ప్రాంతాలకు వెళ్లే దారి రోజురోజుకూ ఇరుగ్గా మారుతోంది. దుకాణ దారులు రోడ్డుపైకి వస్తుండడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది. గతంలో వీటిని తొలగించినా మళ్లీ రోడ్డుపై వ్యాపారాలు చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఈ రోడ్డులో ప్రభుత్వ ఆస్పత్రితో పాటు ప్రైవేటు ఆస్పత్రులు ఉన్నాయి. అత్యవసరంగా వెళ్లే అంబులెన్సులకు దారి లేకుండా పోతుంది. అధికారులు స్పందించి సమస్యకు చెక్ పెట్టాలని కోరుతున్నారు.



దుకాణం ఉన్నా ఫుట్‌పాత్‌పై పేర్చిన వస్తువులు



దారి లేకుండా ఏర్పాటు ఫ్లెక్సీ , తోపుడు బళ్లు

అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని పలు శాఖల అధికారులతో శుక్రవారం నాయుడుతోట లక్ష్మీ కల్యాణ మండపంలో ఎమ్మెల్యే గణబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. రెవెన్యూ, జీవీఎంసీ, విద్యుత్ శాఖ, హౌసింగ్ శాఖ, ప్రజా ఆరోగ్య శాఖ అధికారులు హాజరయ్యారు. జోన్‌-8లోని వార్డు స్థాయి సమస్యలు, పెండింగ్ పనులపై ఎమ్మెల్యే ఆరా తీశారు. పబ్లిక్ వర్క్‌లు, పైప్‌లైన్, యూజీడీ పనులు ఏవిధంగా ఉన్నాయి, ఎక్కడెక్కడ పెండింగ్‌లో ఉన్నాయన్న విషయాలు అడిగి తెలుసుకున్నారు. వీధిలైట్లు, విద్యుత్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని సూచించారు. వార్డు పర్యటనలో అధికారులు తన వెంట వస్తే సమస్యల పరిష్కారానికి అవకాశముంటుందని చెప్పారు. సమావేశంలో జోన్‌-8 కమిషనర్ హేమావతి, ఇతర అధికారులు, 90వ వార్డు కార్పొరేటర్ ముమ్మిడి రమణ, 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేష్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో మిగులు సీట్ల భర్తీ



విద్యార్థికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న జిల్లా సమన్వయకర్త రూపావతి తదితరులు

సబ్బవరం: ఉమ్మడి విశాఖ జిల్లా గురుకుల పాఠశాలల్లోని 2024–25 సంవత్సరానికి గాను మిగులు సీట్లు భర్తీకి సబ్బవరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం ప్రవేశాలు కల్పించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని 11 గురుకులాల్లోని బాలబాలికలకు 5వ తరగతిలో మిగులు సీట్లు భర్తీకి లాటరీ పద్ధతిలో ప్రవేశాలు కల్పించారు. ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త ఎస్. రూపావతి అధ్యక్షతన కౌన్సెలింగ్ నిర్వహించారు. సుమారు 100 మంది విద్యార్థులు ప్రవేశాల కోసం హాజరయ్యారు. కార్యక్రమంలో సబ్బవరం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. రామకృష్ణతో పాటు మిగిలిన గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు హాజరయ్యారు.

టీకాలు తప్పనిసరి

సింథియా: ఆధునిక సమాజంలో ప్రతి ఇంట్లోనూ పెంపుడు జంతువులు ఉంటున్నాయని, అయితే వాటి ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోకుంటే ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని గాంధీగ్రామం పశువుల డాక్టర్ సునీల్‌కుమార్ సూచించారు. పెంపుడు జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సంక్రమించకుండా అవగాహన కల్పించేందుకు ఏటా నిర్వహిస్తున్న వరల్డ్ జూనోసిస్ డే ను పురస్కరించుకుని శనివారం పెంపుడు కుక్కలకు ఉచిత రేబిస్ వ్యాధి టీకాలు వేసే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పెంపుడు కుక్కలను తీసుకువచ్చి ఉచిత యాంటీ రేబిస్ టీకాలు వేయించాలని కోరారు.

క్లుప్తంగా

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కంచరపాలెం: గొల్లకంచరపాలెం దుర్గానగర్‌లో కొలువైన దుర్గమాంబ అమ్మవారి ఆలయంలో శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్య శర్మ అమ్మవారికి కుంకుమ పూజలు, పూలు, పంచామృతాభిషేకాలు జరిపారు. ఆలయ ఆవరణలో భక్తులకు కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు.

ప్లాస్టిక్ సంచుల స్వాధీనం, జరిమానా



ప్లాస్టిక్ సంచులు స్వాధీనం చేసుకుంటున్న ఎస్ఎస్ వెంకటరమణ, శానిటరీ సిబ్బంది

గోపాలపట్నం: జీవీఎంసీ జోన్‌-8 ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు ఆదేశాలతో శుక్రవారం గోపాలపట్నంలో ఎస్ఎస్ వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపి తనిఖీలు చేశారు. గోపాలపట్నం బంక్ వద్ద పలు దుకాణాల్లో ప్లాస్టిక్ సంచులు వాడుతున్న వారిపై దాడులు నిర్వహించారు. వారి వద్ద ఉన్న సంచులను స్వాధీనం చేసుకుని జరిమానా విధించారు.

నేటి నుంచి వారాహి నవరాత్రి ఉత్సవాలు



దేవీపురంలో కొలువైన రాజరాజేశ్వరీదేవి

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి పీఠంలో శనివారం నుంచి ఈ నెల 14వ తేదీ వరకూ వారాహి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసినట్టు గురుమాత అన్నపూర్ణమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవరాత్రుల్లో భాగంగా ప్రతిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించనున్నారు. శనివారం కలశ స్థాపన,గోమాత పూజలతో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. 14న వారాహి యంత్ర సిరిజ్యోతి పూజ,సామూహిక వారాహి సహస్ర నామార్చన పూజలు చేయనున్నట్టు గురుమాత పేర్కొన్నారు. భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రం, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా మంగళ వాయిద్యాల నడుమ తీసుకెళ్ళి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు.

యువతకు అల్లూరి ఆదర్శం



ఉపన్యసిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి భాగ్యలక్ష్మి

మల్కాపురం: స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పోరాటాన్ని యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వేడుకల్లో భాగంగా జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శుక్రవారం సెయింట్ ఆన్స్ కళాశాలలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో గిరిజనుల హక్కుల కోసం అల్లూరి అలుపెరగని పోరాటం చేశారన్నారు. అనంతరం అల్లూరి సీతారామరాజుపై ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

63వ వార్డులో సమస్యల పరిశీలన



అంగన్‌వాడీ కేంద్రంలో సమస్యలను తెలుసుకుంటున్న శివ

సింథియా: జీవీఎంసీ 63వ వార్డులోని పలు ప్రాంతాల్లో గల ప్రజా సమస్యలను శుక్రవారం జనసేన పార్టీ వార్డు అధ్యక్షుడు గొరిపూటి శివ స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. వార్డు సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి సచివాలయాల్లో ముఖ్యమంత్రి ఫొటోతోపాటు ఉపముఖ్యమంత్రి ఫొటోను కూడా పెట్టాలని సూచించారు. ప్రజా సమస్యలను తెలుసుకుని సచివాలయ సిబ్బందికి తెలియజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి సమస్య, పిల్లలు ఆడుకోవడానికి బొమ్మలు, కూర్చోడానికి కుర్చీలు సమకూర్చాలని అడగ్గా.. వాటిని సమకూర్చుతానని శివ హామీ ఇచ్చారు. వార్డు ప్రధాన కార్యదర్శి నానాజీ, మహిళా అధ్యక్షురాలు దాడి లలిత, వార్డు యువజన అధ్యక్షుడు లోకోండ ప్రదీప్, కార్యదర్శులు దివాకర్, ప్రశాంత్, సాయి, అశోక్, గైరీనాయుడు, దిలీప్, చిన్నారావు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులకు చెక్



డ్రైడే–ఫ్రైడేపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మలేరియా నివారణ సిబ్బంది



ప్రశాంతినగర్‌లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఎస్ వెంకటరమణ, ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురంలో శుక్రవారం డ్రైడే–ఫ్రైడేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మల్కాపురం ఏరియా మలేరియా ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో ప్రజలకు సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధుల నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ డ్రైడే–ఫ్రైడేపై ప్రతి ఒక్కరూ అవగాహన ఏర్పరుచుకుని ప్రతి శుక్రవారం, మంగళవారం ఇంట్లో అత్యవసరానికి కావాల్సిన నీటిని ఉంచుకుని, మిగిలిన నీటి పాత్రలను ఖాళీ చేయాలని సూచించారు. ఇలా చేయడం వల్ల సీజనల్ వ్యాధుల కారక దోమల నుంచి రక్షణ పొందవచ్చునన్నారు. ప్రజలు వ్యర్థాలను తడి–పొడి చెత్తగా ఇంటి వద్దే వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతోనే వ్యాధులను నివారించవచ్చునని చెప్పారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. డెంగ్యూ కారక దోమలు మంచినీటిలోనే ఉత్పన్నమవుతాయని, ఈ దోమలు పగటి పూట మాత్రమే కుడతాయన్నారు. 3 రోజులకు ఒకసారి మంచినీటి నిల్వలను మార్చుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లోలో పాతటైర్లు, , బిరడా లేని సీసాలు ఉంచరాదన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఎటువంటి అనారోగ్య సమస్య తలెత్తినా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నియంత్రించి, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ నవరత్నం, మలేరియా సూపర్ వైజర్ దుల్లా శ్రీనివాసరావు, మహిళా పోలీస్ సునీత, పీహెచ్ ఎస్ఎం కొండమ్మ, జీవీఎంసీ సిబ్బంది, ఆధకార్యకర్త జయలక్ష్మి, మలేరియా సిబ్బంది రత్నం, దేవి, సంతోషి, తులసీ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

గోపాలపట్నం/మల్కాపురం: వర్షాకాలం మొదలు కావడంతో సీనల్ వ్యాధులు ప్రబలే అవకాశః ఉన్న నేపథ్యంలో జీవీఎంసీ అధికారులు శుక్రవారం పలు చోట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జీవీఎంసీ 92వ వార్డు గోపాలపట్నం ప్రశాంతినగర్‌లో ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, బయాలజిస్ట్ దాడి సాంబమూర్తి, ఎస్ఎస్ వెంకటరమణ మాట్లాడుతూ దోమలు మంచినీటిలోనే బతుకుతాయన్నారు. అందుకే మన ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపి, మలేరియా విభాగం అధికారులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 61వ వార్డు జనతా కాలనీలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో జిల్లా హెల్త్ సూపర్ వైజర్ సూర్యనారాయణ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రోమాల వేణుబాబు, సచివాలయ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు, మలేరియా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

త్వరితగతిన ఫిర్యాదుల పరిష్కారం

- అర్జీదారులతో మర్యాదగా మెలగండి
- సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశం



మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

బీచ్ రోడ్డు: ఫిర్యాదులను పారదర్శకంగా విచారించి త్వరితగతిన పరిష్కరించాలని సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశించారు. శుక్రవారం ఆయన అకస్మాత్తుగా మూడో పట్టణ పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ ఆనుకొని ఉన్న ఖాళీ ప్రాంతాలను పరిశీలించారు. వ్యర్థాలు పేరుకుపోవడంపై సీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. స్టేషన్‌లో ఎల్లవేళలా సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. పెండింగ్ కేసులను తక్షణం పరిష్కరించాలన్నారు. అన్ని రిజిస్టర్లు ఎప్పటికప్పుడు అప్‌డేట్‌లో ఉండాలని చెప్పారు. సమస్యలు ఏమైనా ఉంటే చెప్పాలని సిబ్బందిని అడిగారు. సిబ్బంది తెలిపిన పలు సమస్యలకు సీపీ తక్షణ పరిష్కారం కోసం చర్యలు తీసుకున్నారు. అదే విధంగా సిబ్బందికి కుటుంబ, ఉద్యోగం పరంగా, ఇతర ఏ సమస్యలు ఉన్నా 79950 95799 నంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని ఆయన కోరారు. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాద మెలగాలన్నారు. వారిని కూర్చోబెట్టి సమస్యలు వినాలని, వాటిని పారదర్శకంగా విచారణ చేసి త్వరితగతిన పరిష్కరించాలని సీపీ సూచించారు. క్రైమ్ పోలీసు స్టేషన్ ఆవరణలో సీజ్ చేసిన, వినియోగంలో లేని వాహనాలను పాడవకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. స్టేషన్‌లో పలు విభాగంలో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. ట్రాఫిక్ పోలీసు స్టేషన్ సందర్శించిన సీపీ.. స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ రద్దీ ఉన్న ప్రాంతాలపై ఎక్కువ దృష్టి సారించాలన్నారు. సీసీ కెమెరాల వినియోగం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. రౌడీ షీటర్స్, సస్పెక్ట్ షీటర్స్ ప్రతి కదలికపై నిఘా పెట్టాలన్నారు. గంజాయి రవాణాపై దృష్టి సారించి, కఠిన చర్యలు తీసుకోవాలని సీపీ ఆదేశించారు.

మాతృభాషను విస్మరించడం తగదు



ప్రసంగిస్తున్న కవి తమ్మిరాజు

గాజువాక : తెలుగు భాష ప్రాముఖ్యత క్రమేపీ అంతరించిపోతోందని పలువురు కవులు ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు ప్రజలకు ఇది దిగ్భ్రాంతిని కలిగించే విషయమన్నారు. తెలుగు భాష పరిరక్షణపై స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో కవులు ప్రసంగించారు. కవి ఎస్.తమ్మిరాజు మాట్లాడుతూ తెలుగును ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అని పిలుస్తారని, అంతటి ప్రాచుర్యం గల తెలుగు ప్రాభవం కోల్పోతోందని అన్నారు. రచయిత మాధవీ సనారా మాట్లాడుతూ దేశ భాషలందు తెలుగు లెస్స అని, విద్యార్థులు ఆంగ్ల భాషను నేర్చుకున్నప్పటికీ మాతృభాషను విస్మరించరాదని అన్నారు. కె.మల్లీశ్వరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ మాతృభాష పట్ల మక్కువ పెంచుకోవాలని, భాష అభ్యున్నతికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ, కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు, అధ్యాపక ప్రతినిధులు వై.ఈశ్వరరాజు, ఎస్.వి.కృష్ణ, రామ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.


మెరుగైన జీవనానికి సహకారం అవసరం



కాంతి కారంచేటిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాలలోని హ్యూమన్ జెనిటిక్స్ విభాగంలో శుక్రవారం అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ఏక ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ స్పెషల్ ఎడ్యుకేటర్ కాంతి కారంచేటి అండర్ స్టాండింగ్ డిజెబిలిటీస్–డయాగ్నోసిస్ టు డిస్టెంట్ డ్రీమ్స్ అంశంపై ప్రసంగించారు. వివిధ రకాల డిజెబులిటీస్, చికిత్స విధానాలు, నివారణ అవకాశాలు వివరించారు. కుటుంబ సభ్యులు, పౌర సమాజం అనుకూల దృక్పథంతో మెరుగైన జీవనం అందించడానికి సహకారం అందించాలన్నారు. ఈ సదర్భంగా కాంతి కారంచేటిని విభాగం తరపున సత్కరించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, విభాగాధిపతి ఆచార్య వి.లక్ష్మి, విశ్రాంత ఆచార్యులు జి.పద్దయ్య, బయోటెక్నాలజీ, మైక్రో బయాలజీ, ఫుడ్ న్యూట్రిషన్ అండ్ డైటిక్స్ విభాగాల బోధన సిబ్బంది, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

కల్యాణం.. కమనీయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు.

నైపుణ్యవంతమైన విద్యతో మెరుగైన అవకాశాలు



కళాశాల నుంచి ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ మంజుల, అధ్యాపక బృందం

డాబాగార్డెన్స్ : నైపుణ్యంతో కూడిన విద్యనభ్యసిస్తే ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల తెలిపారు. కళాశాల జవహర్ నాలెడ్జి సెంటర్ (జేకేసీ), మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సంయుక్తంగా జెన్‌ప్యాక్ట్ పేరిట శుక్రవారం జాబ్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. జెన్‌ప్యాక్ట్ కంపెనీ సీనియర్ మేనేజర్లు సతీష్, శ్యాంసన్, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ప్లేస్‌మెంట్ అధికారి రాజేష్ పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 256 మంది విద్యార్థులు పాల్గొనగా, వీరిలో 70 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో డి. అరుణపద్మ, విద్యాకల్పన, హైమావతి, సంతోషి, అనూష, డాక్టర్ శరణ్య తదితరులు పాల్గొన్నారు.